క్లుప్తంగా

అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు

భద్రాచలంటౌన్: భద్రాచలం చాంబర్ ఆఫ్ కామర్స్, ది రైస్, కిరాణా మర్చంట్ అసోసియేషన్ కార్యవర్గాన్ని రద్దు చేసి అడ్‌హాక్ కమిటీని శనివారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా పరిమి సోమశేఖర్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. పూర్తి స్థాయి నూతన అసోసియేషన్ ఏర్పాటుకు ఈ కార్యవర్గం కృషి చేస్తుందని ప్రధాన కార్యదర్శి కంభంపాటి సురేశ్ తెలిపారు. సమావేశంలో చారుగుండ్ల దేవిప్రసాద్, మల్లికార్జున్‌రావు, శ్రీనివాసరావు, చక్రవర్తి, రవి కుమార్, శ్రీనివాస్, సలీం, రాంబాబు, దేశప్ప, సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

అశ్వాపురం: ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్‌లో శనివారం సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. లైసెన్స్, యూనిఫాం ఉండాలని, వాహనాలు కండీషన్‌లో ఉండేలా చూసుకోవాలని, అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ తిరుపతిరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ నమోదుపై ఇంటింటి సర్వే



మణుగూరురూరల్: ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న ఆర్‌ఐ లీలావతి

మణుగూరురూరల్: స్పెషల్ సమ్మరి రివిజన్ - 2025 కార్యక్రమంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని 241వ పోలింగ్ బూత్‌లో ఆర్‌ఐ లీలావతి ఓటర్ నమోదుపై సిబ్బందితో కలిసి ఇంటింటి సర్వే నిర్వహించారు. సర్వేలో 18 ఏళ్లు నిండిన వారి వివరాలను తెలుసుకుని ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే ఓటర్ జాబితాలో చనిపోయిన వారి పేర్లు తొలగింపు, ఓటర్ కార్డులో మార్పులు, చేర్పులు, సవరణలు వంటివి చేసుకోవాలని సూచించారు.

దుమ్ముగూడెంలో..

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సుబ్బారావుపేట, డబ్ల్యూ రేగుబల్లి గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపట్టినట్లు డాక్టర్ సుభాష్ తెలిపారు. మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహించామని, ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

జీఎంకు సన్మానం



మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న జీఎం, అధికారులు

మణుగూరుటౌన్: సింగరేణిలో సుదీర్ఘకాలం పనిచేసిన కార్పొరేట్ జీఎం(సీఎంసీ) జి.మోహన్‌రెడ్డి ఉద్యోగ విరమణ పొందనుండగా, మణుగూరు ఏరియాకు వచ్చిన సందర్భంగా జీఎం దుర్గం రాంచందర్, అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. 41 సంవత్సరాలు పనిచేసి అధికారులు, ఉద్యోగుల, యాజమాన్య మన్ననలు పొందారని కొనియాడారు. సెక్యూరిటీ అధికారిగా విధులు నిర్వహించి ఆర్‌జీ–3 ఏరియాకు బదిలీపై వెళ్తున్న షబ్బీరుద్దీన్‌ను జీఎం, అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధికారులు లక్ష్మీపతిగౌడ్, వీరభద్రరావు, రమేశ్, మదన్‌నాయక్, అనురాధ, నర్సింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలపై తనిఖీ

మణుగూరుటౌన్: పీకేఓసీ–2 క్యాంటీన్‌లో కార్మికుల అభ్యర్థన మేరకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు, సదుపాయాలపై ఏరియా డీజీఎం (పర్సనల్) శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజన విరామ సమయంలో కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎండీ బలరాంనాయక్ ఆదేశాల మేరకు లోపాల సవరణకు సింగరేణి ఖర్చుకు వెనకాడకుండా కార్మికుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందని తెలిపారు. సింగు శ్రీనివాస్, ఒంకారి బాపు, క్యాంటీన్ ఉద్యోగులు సురేశ్, నవీన్ పాల్గొన్నారు.

హోటళ్లలో డీటీ..

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పలు హోటళ్లలో, రెస్టారెంట్లలో సివిల్ సప్లయి డీటీ శివకుమార్ శనివారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డొమెస్టిక్ సిలిండర్లను వ్యాపార కేంద్రాలకు వినియోగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.



ఉదయం లేవగానే బ్రేక్ ఫాస్ట్‌లో భాగంగా ఇడ్లీ, వడ, దోశ.. తదితర పదార్థాలు తినేందుకు అందరూ ఇష్టపడతారు. వీటిని తయారు చేయడానికి ఇంట్లో మహిళలు ఎక్కువ సమయాన్ని తీసుకోవాల్సి వస్తుంది. ఒకరోజు ముందుగానే పిండిని రుబ్బి తయారుగా ఉంచుకోవాలి. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. వంటకం ఏదైనా సరే.. మార్కెట్లో రెడీమిక్స్ పద్ధతిలో అందుబాటులో ఉన్నాయి. నిమిషాల్లో వంటకాలు రెడీ అవుతున్నాయి. అవి కూడా రుచిగా ఉండటంతో ప్రస్తుతం వాటికి మార్కెట్‌లో గిరాకీ ఎక్కువగా ఉంది. – భద్రాచలంఅర్బన్

వెరీ టేస్టీ.. టైమ్ సేఫ్టీ

- అదుర్స్.. ఇన్‌స్టంట్ మిక్స్
- బిజీ జీవితాలకు కలిసొస్తున్న కాలం
- నిమిషాల్లో బ్రేక్ ఫాస్ట్ రెడీ



పానిపూరీ



దోశ, ఇడ్లీ రెడీమిక్స్



ఇన్‌స్టంట్‌గా తయారు చేసుకునే పాస్తా, కప్ నూడల్స్

సండే స్పెషల్

ఇష్టంగా అల్పాహారం..

ఉదయమే వంట చేసి ఆఫీసుకు వెళ్లే మహిళలు, విద్యార్థులు పొద్దునే ఇష్టమైన అల్పాహారం తినడానికి ఇన్‌స్టంట్ రెడీమిక్స్ ప్యాక్స్ ఉపకరిస్తున్నాయి. పొద్దంతా బిజీగా గడిపేవారందరూ.. ఇన్‌స్టంట్ ఫుడ్‌ను ఇష్టపడుతున్నారు. ఇడ్లీ, వడ, ఉప్మా, ఉతప్పా, దోశలను తయారు చేయడానికి బదులుగా రెడీమేడ్ మిక్స్‌తో అయిన వారికి, ఇంటికి వచ్చి వెళ్లే అతిథులకు వారికిష్టమైన అల్పాహారాలను తయారు చేస్తున్నారు. వీటి వాడకం మూలంగా ఇంటిల్లిపాదికి ఇష్టమైన టిఫిన్స్ వడ్డించడమే కాకుండా సమయం కూడా కలిసి వస్తోంది. పిండిని ఒకరోజు ముందే నానబెట్టి, రుబ్బుకునే పని లేకపోవడంతో వీటిని అన్ని వర్గాల ప్రజలు వినియోగిస్తున్నారు. ఇక క్షణాల్లో తయారయ్యే పాస్తా, ఓట్స్, మసాలా ఓట్స్, నూడుల్స్ వంటివి కూడా లభిస్తున్నాయి. ఇన్‌స్టంట్ రెడీమిక్స్ టిఫిన్ పదార్థాలను బ్రాండెడ్ కంపెనీలు అందిస్తుండటంతో.. బిజీగా ఉండే మహిళలు, ఉద్యోగులు, వంట సరిగా రాని బ్యాచ్‌లర్లు ఎక్కువగా వీటిని వినియోగిస్తున్నారు.

అన్ని చోట్ల లభ్యం..

మార్కెట్‌లో రెడీమిక్స్‌లకు ఆదరణ పెరిగింది. భద్రాచలం పట్టణంలోని సూపర్ మార్కెట్లు మొదలుకొని చిన్నచిన్న కిరాణా షాపుల్లో సైతం ఇన్‌స్టంట్ ఫుడ్ మిక్స్‌లు అందుబాటులో ఉండటంతో వీటికి ప్రాధాన్యం సంతరించుకుంది. బ్రాండెడ్ కంపెనీలకు చెందిన ఇడ్లీ, వడ, ఉప్మా, దోశ, పెసరట్లు, రవ్వ దోశతో పాటు చిన్న పిల్లలు ఇష్టపడే మ్యాగి నూడుల్స్, పాస్తా, కార్న్ ఫ్లాక్స్, ఓట్స్ వంటి చిరుతిండ్లు కూడా సందడి చేస్తున్నాయి. అన్ని వర్గాల ప్రజలు వీటిని కొనుక్కునే ధరల్లోనే కంపెనీలు తయారు చేస్తున్నాయి. భద్రాచలం మార్కెట్లో దొరుకుతున్న కొన్ని ఇన్‌స్టంట్ రెడీమిక్స్‌ల ధరలు కూడా రూ.50 నుంచి రూ.300 లోపు ఉన్నాయి.

ఇంటి ఫుడ్.. వెరీ గుడ్

బ్రేక్ ఫాస్ట్ చేసేవారు ప్రతిరోజు బయటతింటే అనారోగ్యం బారిన పడే అవకాశముండటంతో.. ఇన్‌స్టంట్ ఫుడ్ మిక్స్ ప్యాకెట్లకు ప్రజలు ప్రాధాన్యమిస్తున్నారు. ఇంటిపట్టునే తయారు చేసుకుంటూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటున్నారు. ఇక పొద్దునే బడికి వెళ్లే చిన్నారులకు మార్కెట్లో ఎన్నోరకాల ఇన్‌స్టంట్ సాఫ్ట్ ఫుడ్ ఐటమ్స్ అందుబాటులో ఉన్నాయి. వేడివేడి పాలల్లో వేసుకునే కార్న్ ఫ్లాక్స్, చాకోస్ చిన్నారులకు ఇష్టమైన ఫుడ్ ఇక నిమిషాల వ్యవధిలో తయారు చేసే ఓట్స్, మసాలా ఓట్స్, నూడుల్స్, పాస్తా వంటి కొత్తకొత్త స్నాక్స్‌ను ప్రజలు ఆదరిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో ఫ్రెంచ్ ఫ్రయిస్‌కు డిమాండ్ ఉంది. వీటిని రెడీమేడ్ బ్రాండెడ్ కంపెనీలు అందిస్తున్నాయి.

అనుమతులున్న ఫుడ్ ఐటమ్స్ వాడాలి



ఫుడ్ ఐటమ్స్ కొనేప్పుడు వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలి. ఐటమ్స్‌పై ఎఫ్‌ఎస్‌ఎస్‌ఐ (ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ) అనుమతి పొందిన కంపెనీల ఫుడ్ ఐటమ్స్‌ను వినియోగించడం మేలు. ఇక బ్రేక్‌ఫాస్ట్ ఇన్‌స్టంట్ ఫుడ్ మిక్స్ అందరికీ ఉపయోగంగా ఉంటున్నాయి. ఉద్యోగాలు, బయటకు వెళ్లే వారికి సమయం చాలా సేఫ్.

– డా.రామకృష్ణ, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, భద్రాచలం

కోరుకున్న అల్పాహారం నిమిషాల్లో..



ఇన్‌స్టంట్ ఫుడ్‌తో టైం బాగా కలిసొస్తుంది. రెడీమేడ్ మిక్స్‌తో వండటం చాలా సులువైంది. పొద్దునే హడావుడిలో వెళ్లే పిల్లలకు ఇష్టమైన టిఫిన్స్ తయారు చేసే అవకాశం వచ్చింది. అనుకోని ప్రయాణాలు తారసపడినా.. అతిథులు వచ్చినా వీటిని వాడుకోవచ్చు. కోరుకున్న అల్పాహారం నిమిషాల్లో వండుకునే అవకాశం దక్కింది. టేస్ట్ కూడా బాగా ఉంటున్నాయి.

–సుమలతారెడ్డి, గృహిణి, భద్రాచలం

ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలు



మణుగూరుటౌన్: వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



అశ్వాపురం: ఎక్స్‌లెంట్ పాఠశాలలో..

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధి సుందరయ్యనగర్‌లోని బ్రైట్ మైండ్స్ ప్లే స్కూల్‌లో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గోపిక, కృష్ణుల అలంకరణల్లో చిన్నారుల వేషధారణల్లో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రాంబాబు మాట్లాడుతూ.. పిల్లలకు చిన్ననాటి నుంచే తెలుగు సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన పెంచాలన్నారు. కాగా, ఉట్టి కొట్టే కార్యక్రమంలో శ్రీకృష్ణుని వేషధారణలో ఉన్న చిన్నారులు పోటీ పడగా, గోపికలు, కృష్ణుల చుట్టూ తల్లులు దాండియా ఆడుతూ సందడి చేశారు.

ఎక్స్‌లెంట్ హైస్కూల్‌లో...

పైలట్‌కాలనీలోని ఎక్స్‌లెంట్ స్కూల్లో గోపికలు, కృష్ణుల అలంకరణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. కరస్పాండెంట్ ఖాదర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అశ్వాపురంలో..

అశ్వాపురం: స్థానిక ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు.

షరతులు లేకుండా అమలు చేయండి..



మాట్లాడుతున్న కొమరం సీతారాములు

గుండాల: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా నాయకులు, గుండాల మాజీ సర్పంచ్ కొమరం సీతారాములు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని యాపలగడ్డ గ్రామంలో జరిగిన ఏఐకేఎంఎస్ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయాలని, ఎలాంటి ఆంక్షలు విధించొద్దని సూచించారు. లేనిపక్షంలో రుణమాఫీ కాని రైతులను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బచ్చల సారన్న, పెండేకట్ల పెంటన్న, కల్తీ మల్లన్న, వజ్జ ఎర్రయ్య, ఈసం మంగయ్య, పాయం ఎల్లన్న, పూనెం నరసన్న, మానాల ఉపేందర్, కల్తీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

లాభాల బోనస్ 35 శాతం ఇవ్వాలి

మణుగూరురూరల్: సింగరేణి సంస్థ 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి ఆర్జించిన లాభాల్లో నుంచి కార్మికులకు 35 శాతం వాటా ఇప్పించేందుకు కృషి చేస్తామని ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి త్యాగరాజన్ తెలిపారు. సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని కొండాపురం భూగర్భగనిలో జరిగిన గేట్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గుర్తింపు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీకి ఐఎన్‌టీయూసీ కట్టుబడి ఉంటుందన్నారు. వివిధ ఓపెన్‌కాస్ట్ గనుల్లో, డిపార్ట్‌మెంట్లలో ఖాళీగా ఉన్న టెక్నీషియన్, సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఏరియాలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆయన అధికారులతో కలిసి చర్చలు జరిపారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షులు కృష్ణంరాజు, కార్యదర్శి షాబుద్దీన్, నాయకులు జయరాజు, ఎం.శ్రీనివాస్, సంతోష్ చరణ్, తాళ్లూరి రాము, శ్యామ్ వర్మ, రాందాస్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న త్యాగరాజన్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని 11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కోసం ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఎంఎల్ఎన్ రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెంట్లం సబ్‌స్టేషన్ పరిధిలోని పెంట్లం, అన్నపురెడ్డిపల్లి, వెంకటాపురం, రాజాపురం, నామవరం, బుచ్చన్నగూడెం, మర్రిగూడెం, రామకృష్ణాపురం, అన్నదైవం, ఒడ్డుగూడెం, కంపగూడెం, భాస్కరాపురం గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వెల్లడించారు.

మహాసభను జయప్రదం చేయాలి

అశ్వారావుపేటరూరల్: ఈ నెల 29వ తేదీన అశ్వారావుపేటలో నిర్వహించే ఏఐటీయూసీ 18వ మహాసభను జయప్రదం చేయాలని సీపీఐ నియోజకవర్గ నాయకులు ఎస్‌డీ సలీం కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.. స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో జరిగే మహాసభకు పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషాతోపాటు పలువురు నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. గన్నిన రామకృష్ణ ఉన్నారు.

ముమ్మరంగా యూత్ కాంగ్రెస్ ఓటింగ్

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామంలో శనివారం యూత్ కాంగ్రెస్ ఓటింగ్ కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకి సంబంధించి రాష్ట్ర యూత్ అధ్యక్షుడి నుంచి మండల యూత్ అధ్యక్షుడి వరకు కొద్ది రోజులుగా ఆన్‌లైన్ ద్వారా ఓటింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. దీంట్లో భాగంగా గ్రామ కాంగ్రెస్ నాయకులు నల్లపు నరసింహారావు, నరాల శ్రీను, తమ్మిశెట్టి శ్రీను ఆధ్వర్యంలో పోటీలో ఉన్న అభ్యర్థులకు ఆన్‌లైన్ ద్వారా ఓట్లు వేయించారు. నారం జగదీశ్, జక్కుల జగదీశ్, ఉప్పల సతీశ్, జల్లిపల్లి విశ్వేశ్వరరావు, వేల్పుల నాగమహేశ్వరరావు, ఆలపాటి నరేంద్ర, అల్లం శివ పాల్గొన్నారు.

వేంకటేశ్వర కల్యాణం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని శనివారం వైభవంగా జరిపించారు. స్వామి వారికి ఉదయం పంచామృత అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు స్వామి వారి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. కల్యాణం అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

చట్టాలపై అవగాహన అవసరం



ప్రిన్సిపాల్‌కి సూచనలిస్తున్న జడ్జి వెంకటేశ్వర్లు

భద్రాచలంఅర్బన్: 15 నుంచి 18 ఏళ్ల వయస్సుగల పిల్లలు అధికంగా బాధితులుగా మారుతున్నారని, చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయమూర్తి వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థినులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించగా.. న్యాయమూర్తి పాల్గొని మాట్లాడారు. చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే తప్పులు చేయకుండా ఉంటారని, విద్యార్థినులకు పోక్సో యాక్ట్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాలికల హక్కులు, సమాజంలో వారు ఎదుర్కొంటున్న వివక్ష, హింస బాల్యవివాహాల నిర్మూలన, రైట్ టు ఎడ్యుకేషన్, జువైనెల్ జస్టిస్ యాక్ట్, భారత రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు తదితర అంశాలపై న్యాయమూర్తి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినుల హాస్టల్‌ను తనిఖీ చేసి పోషకాహారాన్ని అందించాలని, వైద్య పరంగా అన్ని సదుపాయాలు కల్పించాలని కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతికి సూచించారు. కార్యక్రమంలో భద్రాచలం టౌన్ సీఐ సంజీవరావు, భద్రాచలం బార్ అసోసియేషన్ సభ్యులు రమేశ్, సీనియర్ న్యాయవాదులు అవులూరు సత్యనారాయణ, పేరాల వెంకటేశ్వర్లు, పామరాజు తిరుమల్ రావు, కొలిచలం నవీన్‌కుమార్, సాధనపల్లి సతీశ్, సంధ్య, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐటీసీ సహకారంతో మౌలిక వసతులు

బూర్గంపాడు: ఐటీసీ పీఎస్‌పీడీ సహకారంతో బూర్గంపాడు మండలంలో మౌలికవసతుల కల్పనకు కృషి చేస్తున్నామని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సారపాకలో రూ.90 లక్షల ఐటీసీ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన మిషన్ భగీరథ పైప్‌లైన్ విస్తరణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పారిశ్రామిక ప్రాంతమైన సారపాకలోని అన్ని కార్మికవాడల్లో మిషన్ భగీరథ తాగునీటిని అందించేందుకు పైప్‌లైన్ల విస్తరణ కోసం ఐటీసీ సీఎస్ఆర్ నిధులు కేటాయించటం అభినందనీయమన్నారు. పైప్‌లైన్ పనుల విస్తరణ పూర్తయితే సారపాకలోని అన్ని ఏరియాలకు పుష్కలంగా తాగునీరు అందుతుందన్నారు. మండలంలోని గ్రామాల్లో డ్రెయినేజీలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆస్పత్రులు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ఐటీసీ సీఎస్ఆర్ నిధులు ఉపయోగపడతాయని చెప్పారు. విద్య, వైద్యం, మౌలికవసతుల కల్పనకు ఐటీసీ రానున్న రోజుల్లో మరింత సహకారమందించాలని కోరారు. అనంతరం ఇరవెండి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఐటీసీ విద్యాజ్యోతి పథకంలో భాగంగా నోట్‌బుక్స్‌ను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐటీసీ పీఎస్‌పీడీ మానవ వనరుల విభాగం జనరల్ మేనేజర్ శ్యామ్‌కిరణ్, చెంగల్‌రావు, ట్రేడ్ యూనియన్ నాయకులు కనకమేడల హరిప్రసాద్, యారం పిచ్చిరెడ్డి, స్థానిక నాయకులు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, మారం వెంకటేశ్వరరెడ్డి, తాళ్లూరి జగదీశ్వరరావు, పేరాల శ్రీనివాస్, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పైప్‌లైన్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు

శాంతిభద్రతల రక్షణ కోసమే కార్డెన్ సెర్చ్

మణుగూరురూరల్: శాంతిభద్రతల పరిరక్షణ కోసమే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని మణుగూరు సీఐ సతీశ్‌కుమార్ తెలిపారు. మండలంలోని వలస గొత్తికోయ గ్రామమైన సర్వాయిగుంపులో మణుగూరు డీఎస్పీ వంగా రవీందర్‌రెడ్డి ఆదేశాల మేరకు సీఐ సతీశ్‌కుమార్ సిబ్బందితో కలిసి శనివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై మాట్లాడారు. ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చినా, అనుమానాస్పదంగా సంచరించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. నిషేధిత మావోయిస్టులకు సహాయ, సహకారాలు అందించవద్దని, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మేడా ప్రసాద్, పోలీస్, టీజీఎస్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ సతీశ్‌కుమార్

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..



మాట్లాడుతున్న తెల్లం సీతమ్మ

దుమ్ముగూడెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తెల్లం సీతమ్మ కోరారు. శనివారం లక్ష్మీనగరం గ్రామంలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా ఆమె పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఒక్కొక్క పథకాన్ని అమలు చేస్తూ పోతూ ఉంటే ప్రతిపక్షాలకు మింగుడు పడటం లేదన్నారు. గత పదేళ్లలో ఏ ఒక్క ప్రభుత్వ పథకం కూడా సరిగ్గా ప్రజల్లోకి వెళ్లలేదని ఆరోపించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లంక శ్రీనివాసరావు, మట్టా శివాజీ, కుంజా శ్రీనివాసరావు, తోటమల్ల సుధాకర్, పూజారి సూర్యచంద్రరావు, తెల్లం హరి, కెల్లా శేఖర్, గడ్డం బాలాజీ, బత్తుల శోభన్, తోట రమేశ్, కొమ్ము రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ సేవలు వినియోగించుకోండి..

కరకగూడెం: ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎస్‌బీఐ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంక్ రీజినల్ మేనేజర్ ఎం.సత్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం ఆయన ఏడూళ్ల బయ్యారం శాఖ ఆధ్వర్యంలో కరకగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో రైతులు, ఖాతాదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ తమ బ్యాంక్‌లో వ్యవసాయ రుణాలకు ప్రాధాన్యం ఉంటుందని, రుణం తీసుకున్న ప్రతీ రైతు క్రమం తప్పకుండా రెన్యూవల్ చేసుకోవాలని, అలా చేసుకుంటే ప్రభుత్వం నుంచి వచ్చే 3% వడ్డీ రాయితీకి అర్హులవుతారని పేర్కొన్నారు. ప్రతి రోజూ గోల్డ్, వాహన, ఇళ్ల, వ్యాపార రుణాలు మంజూరు చేస్తూ అన్నివర్గాల వారికి చేయూతనిస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకింగ్ సేవలను 'వినియోగదారుల సేవా కేంద్రం' ద్వారా అందుబాటులోకి తెచ్చామని, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, జీవన జ్యోతి యోజన వంటి బీమా పథకాలను అర్హులు బ్యాంకుకు రాకుండానే మండల కేంద్రంలోని ఈ వినియోగదారుల సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవడం ద్వారా పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ అనిల్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణ, వినియోగదారుల సేవా కేంద్రం నిర్వాహకులు వజ్జ సాంబశివరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రీజినల్ మేనేజర్ సత్యనారాయణ

మేల్కొనండి..



అనంతారంలో రహదారి కోతకు గురై పడిన గుంత

అశ్వారావుపేటరూరల్: ప్రధాన రహదారికి మూడు చోట్ల వరద కారణంగా రోడ్డు కోతకు గురై పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. నెల రోజులు దాటుతున్నా అధికారులు దృష్టి పెట్టకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. అశ్వారావుపేట మండలం అనంతారం గ్రామ వద్దగల పెదవాగు వంతెన దగ్గర బీటీ రహదారికి మూడు చోట్ల గండ్లు పడ్డాయి. గత నెల 18వ తేదీన వచ్చిన భారీ వరదతో పెదవాగు ఉప్పొంగి ప్రవహించగా, బీటీ రహదారి భారీగా కోతకు గురైంది. దీంతో అనంతారం వాగు దగ్గర ఉన్న హైలెవల్ వంతెనకు ఇరువైపులా రహదారి కొట్టుకుపోగా గుంతలు పడ్డాయి. అలాగే మిషన్ భగీరథ పైపులు కుడా బయట పడ్డాయి. ఈ మార్గంలో వాహన చోదకులు ప్రయాణం సాగించాలంటే ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకొని మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.